
సాక్షి అనంతపురం

గురువారం। 19। జనవరి। 2023



మధ్యయుగ వైతాళికుడు వేమన

తన సాహిత్యంతో పామరులను సైతం మేల్కొల్పిన మధ్యయుగ వైతాళికుడు వేమన జయంత్యుత్సవాలకు సర్వం సిద్ధమైంది. 8లో



టమాట కిలో రూ.25

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టం రూ.25, కనిష్ట ధర రూ.10 ప్రకారం పలికింది.

గరిష్టం/కనిష్టం

31.7°/11.5°

జిల్లా అంతటా బుధవారం చలి తీవ్రత కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. రాత్రి ఉష్ణోగ్రతల్లో తగ్గుదల కన్పించింది.

● జనసంద్రమైన 'తోపుదుర్తి'

- ఎమ్మెల్యే విందుకు అశేష జనం
- తరలివచ్చిన పలువురు ప్రజాప్రతినిధులు, నేతలు
- ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ఏర్పాట్లు



తోపుదుర్తి గ్రామానికి భారీగా తరలివస్తున్న జనం



తోపుదుర్తికి తరలివచ్చిన వారితో కరచాలనం చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

8లో

న్యూస్‌రీల్

మద్దతు ధరతో కందుల కొనుగోలు



అనంతపురం అగ్రికల్చర్: ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)తో రైతులు పండించిన కందులు కొనుగోలు చేయనున్నట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పెన్నేశ్వరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌బీకే వేదికగా క్వింటా రూ.6,600 ప్రకారం కొనుగోలు చేసి మూడు వారాల్లోపు రైతుల ఖాతాల్లోకి సొమ్ము జమ చేస్తామన్నారు. రైతులు పంట సాగు చేసినట్లు ఈ-క్రాప్ నమోదు చేసుకుని ఉండాలన్నారు. ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకుంటే త్వరలోనే కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

విద్యుత్ చార్జీలపై నేటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

అనంతపురం టౌన్: విద్యుత్ చార్జీల ప్రతిపాదనలపై జిల్లా వ్యాప్తంగా గురువారం నుంచి ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ సురేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ మూడు రోజుల పాటు జిల్లాలోని అన్ని డివిజన్ కేంద్రాల్లో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. వినియోగదారులు అభిప్రాయాలను తెలపాలని ఆయన కోరారు.

వసతి గృహాల పునఃప్రారంభం

అనంతపురం రూరల్: సంక్రాంతి సెలవుల అనంతరం జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను గురువారం పునఃప్రారంభించనున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ విశ్వమోహన్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు హాస్టళ్లలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. వార్డెన్లందరూ విధులకు తప్పకుండా హాజరుకావాలని ఆదేశించారు.

ఏపీ ఈఏపీసెట్ రాష్ట్ర కన్వీనర్‌గా శోభాబిందు



ఆచార్య శోభాబిందును అభినందిస్తున్న వీసీ జింకా రంగజనార్దన

అనంతపురం: ఏపీ ఈఏపీసెట్- 2023 రాష్ట్ర కన్వీనర్‌గా జేఎన్‌టీయూ (ఏ) ప్రొఫెసర్ సి.శోభాబిందు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఏపీ ఈఏపీసెట్‌ను రెండో దఫా జేఎన్‌టీయూ (ఏ) నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో జేఎన్‌టీయూ (ఏ) పాలకభవనంలో సెట్ కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించారు. కార్యక్రమానికి జేఎన్‌టీయూ వీసీ, ఏపీ ఈఏపీసెట్ రాష్ట్ర చైర్మన్ జింకా రంగజనార్దన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏపీ ఈఏపీసెట్ కన్వీనర్ శోభాబిందును వీసీతో పాటు రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్ తదితరులు అభినందించారు.

వీసీకి అభినందనలు

జేఎన్‌టీయూ(ఏ) వీసీ జింకా రంగజనార్ధన బాధ్యతలు స్వీకరించి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు. రెండేళ్లలో వర్సిటీ అభివృద్ధికి ఆయన అమలు చేసిన సంస్కరణలను రిజిస్ట్రార్ సి.శశిధర్ కొనియాడారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌కు ప్రతి అధ్యాపకుడు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఓఎస్డీ టు వీసీ దేవన్న, ప్రిన్సిపాల్ పి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

నిర్విఘ్నంగా మహా క్రతువు

- ఉమ్మడి జిల్లాలో జోరుగా భూముల రీసర్వే
- చిక్కుముడులు విప్పుకుంటూ ముందుకెళుతున్న అధికారులు
- డిసెంబర్‌కల్లా పూర్తి చేయాలనే లక్ష్యంతో అడుగులు

ఎవరైనా సరే తాము కష్టపడి సంపాదించిన ఆస్తిని తమ పిల్లలకు ఇవ్వాలనుకుంటారు. తీరా ఆ సమయమొచ్చే సరికి ఆ భూమిని ఎవరో గద్దల్లా తన్నుకుపోతే.. ఆ బాధ ఎలా ఉంటుందో ఊహించుకోవడానికి కూడా ఎంతో కష్టంగా ఉంటుంది. ఇలాంటి పరిస్థితులు ఎక్కడా తలెత్తకుండా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష' పథకానికి శ్రీకారం చుట్టింది. ఎప్పుడో వంద సంవత్సరాల కిందటి రికార్డులకు సంబంధించిన భూములనూ ఎలాంటి వివాదాలకు తావు లేకుండా, లంచాలకు ఆస్కారమివ్వకుండా అత్యాధునిక యంత్రాలతో పకడ్బందీగా సమగ్రంగా రీసర్వే చేపడుతోంది.



శెట్టూరు పరిధిలోని ఓ పొలంలో సర్వే చేస్తున్న అధికారులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో భూముల సమగ్ర రీ సర్వే నిర్విఘ్నంగా సాగుతోంది. ప్రతి మండల పరిధిలో క్షేత్రస్థాయి అధికారులు అత్యంత కచ్చితత్వంతో కొలతలు తీస్తూ ముందుకు సాగుతున్నారు. దశాబ్దాల తరబడి వివాదాలు, కోర్టు కేసులు, గొడవలతో తమ భూములను అమ్ముకోలేక పోయిన ఎంతో మంది హక్కుదారులకు సర్వే ఊరటనిస్తోంది. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా భవిష్యత్‌లో ఎలాంటి భూ వివాదాలూ తలెత్తకుండా ఉండాలనే లక్ష్యంతో అధికారులు రికార్డులు తయారు చేస్తున్నారు.

అడ్డంకులను అధిగమిస్తూ

క్షేత్రస్థాయిలో భూములు సర్వే చేస్తున్నప్పుడు రకరకాల చిక్కుముడులు ఎదురవుతున్నాయి. కొంతమంది హక్కుదారులు చనిపోవడంతో భూమార్పిడి జరగకుండా ఆగిపోయింది. కొన్ని కోర్టు కేసులు, ఇంకొన్ని సర్వే నంబర్లలో ఉన్నదాని కంటే ఎక్కువ భూమి ఉండటం, సర్వే నంబర్ల సవరణలు ఇలా.. ఒకటి రెండు కాదు వందల కేసుల్లో రకరకాల చిక్కుముడులు విప్పుకుంటూ రికార్డులు సవరిస్తున్నారు. వందేళ్ల నుంచి ఎవరూ పట్టించుకోక పోవడంతో తాజా రీసర్వే పెద్ద సవాలుగా మారింది.

ఇప్పటివరకూ జిల్లాలో రీసర్వే సాగిందిలా..

మొత్తం గ్రామాలు	504
సర్వే మొదలైనవి	467
పరిశీలించిన సర్వే నంబర్లు	48,689
పూర్తయిన రికార్డులు	75,301
వివాదాస్పద రికార్డులు	42
మరణాలతో ఆగిన మ్యుటేషన్లు	316
సర్వే నంబర్ల తొలగింపు	2,568
నిషేధిత భూముల రికార్డులు	303
కోర్టు కేసులు	92

అయినా ప్రతి గ్రామ పరిధిలో భూములు, హక్కుదారుల సరిహద్దులు, గ్రామకంఠాలు, పోరంబోకు, చుక్కల భూములు, నిషేధిత భూములు, ప్రభుత్వ భూములు ఇలా ప్రతి రికార్డునూ క్షుణ్ణంగా పరిశీలించి రికార్డుల్లోకి ఎక్కిస్తున్నారు.

డిసెంబరు నాటికి పూర్తి

"డిసెంబర్ నాటికి రీసర్వే ప్రక్రియ పూర్తి చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం. క్షేత్రస్థాయిలో ఫీల్డ్ సర్వే ముమ్మరంగా సాగుతోంది. రీసర్వే పూర్తయితే భూములకు సంబంధించిన రికార్డులు పారదర్శకంగా ఉంటాయి. వివాదాలకు తావుండదు.

–మధుసూదన్, ఆర్డీఓ, అనంతపురం

హక్కుదారులకు పూర్తి న్యాయం

అడ్డంకులను ఎప్పటికప్పుడు అధిగమిస్తున్నాం. నిజమైన హక్కుదారులకు రీసర్వే న్యాయం చేస్తుంది. సూక్ష్మ వివాదాలను కూడా పరిష్కరించి రికార్డులు భద్రపరుస్తున్నాం. ఈ ప్రక్రియ పూర్తయితే డూప్లికేట్ రిజిస్ట్రేషన్లు, కబ్జాలనేవి చోటుచేసుకోవు."

–నిశాంత్‌రెడ్డి, ఆర్డీఓ, కళ్యాణదుర్గం

పకడ్బందీగా కానిస్టేబుల్ ప్రిలిమినరీ

- ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప



పరీక్షా కేంద్రం పరిశీలనకు వస్తున్న ఎస్పీ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్/గుత్తి: కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షను పకడ్బందీగా నిర్వహిస్తామని ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి తెలిపారు. బుధవారం స్థానిక జేఎన్‌టీయూ పరీక్ష కేంద్రం, గుత్తిలోని స్ట్రాంగ్ రూంలను పరిశీలించిన అనంతరం ఎస్పీ మీడియాతో మాట్లాడారు. మొత్తం 47 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 22న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పరీక్ష ఉంటుందన్నారు. మొత్తం 24,055 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. పరీక్ష సమయం కంటే గంట ముందు నుంచి అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతిస్తామన్నారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు వెంట తీసుకురాకూడదని సూచించారు. హాల్ టికెట్లతో పాటు గుర్తింపు కార్డు, బ్లూ లేదా బ్లాక్ బాల్ పెన్ను మాత్రమే తెచ్చుకోవాలన్నారు. మాల్ ప్రాక్టీస్, కాపీయింగ్‌కు తావులేకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతపురం రీజినల్ కో ఆర్డినేటర్‌గా అదనపు ఎస్పీ నాగేంద్రుడు, గుత్తి రీజినల్ కో ఆర్డినేటర్‌గా గుంతకల్లు డీఎస్పీ యు.నరసింగప్ప, రాయలసీమ కో ఆర్డినేటర్‌గా డీఎస్పీ గంగయ్యను ఏర్పాటు చేశామన్నారు. సెంటర్ల వద్ద డీఎస్పీ స్థాయి అధికారి నేతృత్వంలో 10 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు పర్యవేక్షిస్తాయని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు నాగేంద్రుడు, హనుమంతు, డీఎస్పీలు మహబూబ్ బాషా, గంగయ్య, వన్‌టౌన్ సీఐ రవిశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ ఏఓగా అమృతరాజ్



అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ అకౌంట్స్ ఆఫీసర్ (ఏఓ)గా ఉరవకొండ ఎంపీడీఓగా పని చేస్తున్న ఎండీ అమృతరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు జెడ్పీ సీఈఓ భాస్కరరెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన ఉరవకొండ ఎంపీడీఓగా రిలీవ్ అయి కొత్త పోస్టులో చేరారు. కాగా, నాలుగు నెలల క్రితం ఏఓగా నియమితులైన గుత్తి ఎంపీడీఓ చిత్రా శ్రీనివాసులు అనేక వివాదాలకు కేంద్ర బిందువు కావడంతో ఆయనను యథాస్థానానికి పంపడం గమనార్హం. ఈ మేరకు ఉత్తర్వులు అందగానే ఆయన రిలీవ్ అయ్యారు.

గుప్త నిధుల ముఠా అరెస్టు

- పట్టుబడిన తొమ్మిది మంది
- ఏఆర్ మాజీ కానిస్టేబుల్ హత్య కుట్ర బట్టబయలు

పుట్టపర్తి అర్బన్: శ్రీసత్యసాయి జిల్లా నల్లమాడ మండలం వంకరకుంటలో సంచలనం రేకెత్తించిన గుప్త నిధుల తవ్వకాల కేసులో పోలీసులు పురోగతి సాధించారు. గుప్తనిధుల తవ్వకాలకు పాల్పడిన తొమ్మిది మందిని అరెస్ట్ చేశారు. బుధవారం సాయంత్రం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను పుట్టపర్తి డీఎస్పీ యశ్వంత్ వెల్లడించారు.

ఏం జరిగిందంటే..

నల్లమాడ పోలీసు సర్కిల్ పరిధిలోని వంకరకుంట గ్రామానికి చెందిన రైతు వెంకటాద్రి పొలంలో గుప్త నిధుల కోసం ఈ నెల 14న కొందరు తవ్వకాలు జరిపారు. ఈ ఘటనపై రైతు వెంకటాద్రి ఫిర్యాదు మేరకు అప్పట్లో నల్లమాడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ ఆదేశాల మేరకు డీఎస్పీ యశ్వంత్ పర్యవేక్షణలో పోలీసులు మూడు బృందాలుగా విడిపోయి లోతైన దర్యాప్తు చేపట్టారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో అసలు విషయం వెలుగు చూసింది.

పట్టుబడింది వీరే..

గుప్త నిధుల తవ్వకాల కేసులో పట్టుబడిన వారిలో ఖమ్మం నివాసి నిజాముద్దీన్, నల్లమాడ మండలం చెరువు వాండ్లపల్లికి చెందిన శివశంకరరెడ్డి, నరేంద్ర రెడ్డి, హైదరాబాద్ నివాసి శ్రీనివాసులు, పుట్టపర్తికి చెందిన విజయ్, తమిళనాడుకు చెందిన చాంద్ బాషా, మురుగన్, సురేష్, అనంతపురానికి చెందిన ఏఆర్ మాజీ కానిస్టేబుల్ ప్రకాష్ భార్య నాగమణి ఉన్నారు. వీరి నుంచి గుప్త నిధుల తవ్వకానికి వినియోగించిన ఇనుపరాడ్లు, బండను తొలగించేందుకు ఉపయోగించే 20/30 పౌడర్, పూజకు వినియోగించిన ముడుపు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కాగా ఇదే కేసులో మరికొందరు నిందితులు పరారీలో ఉన్నారు.

హత్య కుట్ర వెలుగులోకి

పట్టుబడిన నిందితులను విచారణ చేయడంతో అనంతపురం జిల్లాకు చెందిన ఏఆర్ మాజీ కానిస్టేబుల్ ప్రకాష్ హత్యకు పన్నిన కుట్ర వెలుగు చూసింది. ప్రకాష్, నాగమణి దంపతులు. ప్రకాష్ మరో మహిళతో వివాహేతర సంబంధం ఏర్పాటు చేసుకుని భార్యను నిర్లక్ష్యం చేయడమే కాక, వేధింపులకు గురి చేస్తుండడంతో ఖమ్మంకు చెందిన నిజాముద్దీన్‌తో కలిసి భర్త హత్యకు నాగమణి పథకం రచించింది. దీంతో తదుపరి విచారణ నిమిత్తం ఈ కేసును అనంతపురం పోలీసులకు బదిలీ చేశారు. కాగా, నిందితుల అరెస్టులో చొరవ చూపిన నల్లమాడ సీఐ నిరంజన్‌రెడ్డి, నల్లమాడ, ఓడీసీ, బుక్కపట్నం, అమడగూరు ఎస్ఐలు వలీ బాషా, గోపీకుమార్, నరసింహుడు, వెంకటరమణ, సర్కిల్ సిబ్బందిని శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న పుట్టపర్తి డీఎస్పీ యశ్వంత్

సమస్యలపై ప్రజలను తిప్పించుకోవద్దు

- అన్ని రకాల సేవలూ సచివాలయాల్లోనే అందాలి
- కలెక్టర్ నాగలక్ష్మి

గుంతకల్లుటౌన్: ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రజలను తిప్పించుకోరాదని కలెక్టర్ నాగలక్ష్మి సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం ఆమె పట్టణంలోని 29వ వార్డు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మున్సిపాలిటీలో ఆస్తి, నీటి పన్నుల వసూలు, రేషన్‌షాపుల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ, అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు, ఆయుష్మాన్ భారత్‌లో నమోదు తదితర విషయాలపై కార్యదర్శులతో ఆరా తీశారు. ప్రజలకు తక్కువ సేవలు అందిస్తుండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అన్ని రకాల సేవలనూ వార్డు సచివాలయాల్లోనే అందించాలని ఆదేశించారు. పది ఫలితాల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేలా చొరవ చూపాలని మున్సిపల్ కమిషనర్ బండిశేషన్నకు సూచించారు. పేదలకు ఇంటిస్థలాల పంపిణీకి అవసరమైన ప్రభుత్వ భూములను చదును చేయడానికి నిధులు విడుదల చేయాలని ఆర్‌డీఓ రవీంద్ర, మున్సిపల్ కమిషనర్ బండిశేషన్న, తహసీల్దార్ రాములు కలెక్టర్‌ను కోరగా.. ఎంతమేర నిధులు అవసరమో అంచనాలు తయారు చేసి పంపాలని ఆమె ఆదేశించారు. లోతట్టు ప్రాంతంలో ఇళ్లస్థలాలిచ్చిన లబ్ధిదారులకు మరో చోట నివేశస్థలాలివ్వాలని కోరుతూ 33వ వార్డు కౌన్సిలర్ విద్యారాణి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టర్ పట్టణంలో దోనిముక్కల రోడ్డులోని జగనన్న లేఅవుట్-1ను పరిశీలించారు. నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అవసరమైన సౌకర్యాలను వెంటనే కల్పించాలని సూచించారు. వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలు ఉగాది నాటికి పూర్తయ్యేలా చూడాలన్నారు. లబ్ధిదారులతో సమస్యలను తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, హౌసింగ్ డీఈ రామక్రిష్ణ తదితరులున్నారు.



గుంతకల్లు 29వ వార్డు సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

ఉత్తమ ఫలితాలు సాధించాలి

వజ్రకరూరు: పదో తరగతి పరీక్షల్లో ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ నాగలక్ష్మి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని రాగులపాడు, వెంకటాంపల్లి, ఎస్ఎస్‌పీ తాండా, తట్రకల్లు గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఆయా గ్రామాల్లో సచివాలయాలు, ఆర్బీకేలు, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాలను పరిశీలించారు. గడువులోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. వెంకటాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనులను పరిశీలించిన అనంతరం విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు. కాగా, గ్రామాల్లో పర్యటించిన కలెక్టర్‌కు సమస్యలు పరిష్కరించాలంటూ పలువురు ప్రజాప్రతినిధులు వినతిపత్రాలు సమర్పించారు. అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, ఆర్డీఓ రవీంద్ర, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ రమావత్‌దేవి, తదితరులు పాల్గొన్నారు.

గడువులోపు లక్ష్యం పూర్తి చేయండి

- ఏపీఎంఐపీ పీఓ హరినాథరెడ్డి ఆదేశం

అనంతపురం అగ్రికల్చర్: డ్రిప్, స్ప్రింక్లర్ల లక్ష్యాన్ని గడువు లోపు పూర్తి చేయాలని ఏపీఎంఐపీ ప్రాజెక్టు ఆఫీసర్ (పీఓ) సీబీ హరినాథరెడ్డి ఆదేశించారు. బుధవారం ఆయన విజయవాడ నుంచి జిల్లా అధికారులు జి.ఫిరోజ్‌ఖాన్, సుదర్శన్‌తో పాటు డ్రిప్ కంపెనీ ప్రతినిధులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన 16,200 హెక్టార్ల లక్ష్యంలో ప్రస్తుతానికి 8,500 హెక్టార్లకు పరికరాలు మంజూరు చేశామన్నారు. మిగిలిన పది వారాల్లో వంద శాతం పూర్తి చేయాలన్నారు. ప్రతి రైతుకూ నాణ్యమైన పరికరాలు అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. కంపెనీల బకాయిలను ఫిబ్రవరి రెండో వారంలోపు చెల్లిస్తామని తెలిపారు.

క్లుప్తంగా

'అగ్నిపథ్'పై సందేహాల నివృత్తికి వాట్సాప్ నంబర్

అనంతపురం కల్చరల్ :అగ్నిపథ్ కింద భారత వాయుసేనలో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఫిబ్రవరి 4, 5 తేదీల్లో మెడికల్, 7, 8 తేదీల్లో ఫిజికల్ ఫిట్నెస్, రాత, అడాప్టబులిటి పరీక్షలను చెన్నైలోని ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో నిర్వహించనున్నారు. ఈ క్రమంలో అభ్యర్థులు 93453 77868 వాట్సాప్ నంబర్‌ను సంప్రదించి వారి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. ఈ మేరకు ఆన్‌సెట్ సీఈఓ కేశవ నాయుడు బుధవారం ప్రకటన విడుదల చేశారు.

21న కబడ్డీ జట్ల ఎంపిక

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా కబడ్డీ సీనియర్ పురుషుల, మహిళల జట్ల ఎంపికలను ఈ నెల 21న బత్తలపల్లిలోని ఆర్డీటీ క్రీడా మైదానంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి రామయ్య బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10 గంటలకు మొదలయ్యే ఎంపికల ప్రక్రియకు క్రీడాకారులు తమ వెంట ఆధార్ కార్డు, ఎస్ఎస్‌సీ మార్కుల జాబితాను తీసుకెళ్లాలి. పురుషులు 85 కేజీల్లోపు, మహిళలు 75 కేజీల్లోపు బరువుండాలి. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 25 నుంచి 27 వరకూ విశాఖపట్నం జిల్లా అంకుపాళ్యంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటారు.

విద్యార్థులకు కంటి అద్దాల సరఫరాకు టెండర్ల ఆహ్వానం

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు అవసరమైన కంటి అద్దాల సరఫరాకు టెండర్ల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. ఈ మేరకు జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సైదన్న బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 6,800 మంది విద్యార్థులకు సంబంధించి అద్దాలు, ఫ్రేమ్ కలిపి ఒకటికి రూ.280కు ధర మించకుండా సీల్డ్ కవర్ ద్వారా ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు రూ.5వేల ధరావత్తుతో టెండర్ దాఖలు చేయాలి.


ప్రమాదంలో ఒకరి మృతి

శెట్టూరు: ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం మండలం మోరేపల్లికి చెందిన దంపతులు ప్రవీణ్, బేబి... బచ్చేహళ్లి నుంచి ద్విచక్ర వాహనంపై బుధవారం స్వగ్రామానికి ప్రయాణమయ్యారు. బచ్చేహళ్లి గేట్ వద్దకు చేరుకోగానే.. కుందుర్పి మండలం రుద్రంపల్లికి చెందిన నాగభూషణ (45), నాగప్ప ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నారు. ఘటనలో గాయపడిన నలుగురినీ స్థానికులు కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే నాగభూషణ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మధ్యయుగ వైతాళికుడు వేమన

వానకు తడవనివారు, ఒక్క వేమన పద్యం కూడా రాని తెలుగువారు ఉండరని లోకోక్తి. సుమారు 1652 – 1730 మధ్య కాలములో జీవించిన వేమన.. ప్రజాకవిగా.. సంస్కరణాభిలాషిగా.. కులాన్ని నిరసించిన మానవతావాదిగా.. పరభాషా ఆధిపత్యాన్ని ప్రశ్నించి తెలుగు వారి గుండెల్లో చిరస్మరణీయుడిగా నిలిచారు. మూఢాచారాలపై చైతన్య బావుటా ఎగురేసి తర్వాతి తరానికి పూర్వ రంగం సిద్ధం చేశాడన్న సత్యాన్ని ఎంతో మంది సిద్ధాంతీకరించారు. ఆటవెలదులనే తూటాలుగా మార్చి, తన కవితా స్ఫూర్తితో తెలుగు సాహితీలోకాన్ని సుసంపన్నం చేసిన యోగి వేమనకు అత్యంత గౌరవమిస్తూ ఆయన జయంతిని తొలిసారి రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేసింది. ఈ నేపథ్యంలో గురువారం వేమన జయంతిని సంబరంగా నిర్వహించేందుకు ఉమ్మడి జిల్లాలో అధికారులు ఏర్పాట్లు చేశారు. శ్రీసత్యసాయి జిల్లా కటారుపల్లెలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించనున్నారు. – అనంతపురం కల్చరల్:

- తెలుగు సాహిత్యానికి దిశానిర్దేశం చేసిన ప్రజాకవి జయంత్యుత్సవాలు నేడు అధికారికంగా



కటారుపల్లిలో పూజలందుకుంటున్న వేమన సమాధి

'భూమిలోన పుట్టు భూసారమెల్లను
తనువులోన పుట్టు తత్వమెల్ల
శ్రమములోన పుట్టు సర్వంబుతానవును
విశ్వదాభి రామ వినుర వేమ'

...ఇలా అందరికీ అర్థమయ్యే చిన్న పదాలతో సంఘ సంస్కరణ, శ్రమ గొప్పతనం, నైతిక విలువల నిర్మాణం వంటి జీవిత సత్యాలను తెలిపిన మధ్యయుగ వైతాళికుడు వేమనను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గతంలో ఎన్నో ఉత్సవాలు జిల్లా వేదికగా సాగాయి. అయితే అధికారికంగా తొలిసారి వేమన జయంతి ఉత్సవాలను నిర్వహిస్తుండడంపై సాహితీవేత్తలు, విద్యావేత్తలు ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నారు.


'అనంత'తో మమేకం

ఉమ్మడి 'అనంత' జిల్లాతో వేమన జీవితం ముడిపడిపోయింది. గండికోటను పాలించే గడ్డంరెడ్డి మూడవ సంతానంగా 1652లో వేమారెడ్డి జన్మించినట్లుగా చరిత్ర చెబుతోంది. అయితే ఆయన జన్మస్థలంపై కచ్చితమైన సమాచారం లేకున్నా.. 1730లో కదిరి ప్రాంతంలో సమాధి అయిన మాట వాస్తవమని అందరూ అంగీకరిస్తున్నారు. ఇప్పటికీ ఆయన సమాధి ఉన్న శ్రీసత్యసాయి జిల్లా గాండ్లపెంట మండలం కటారుపల్లె పర్యాటక క్షేత్రంగా భాసిల్లుతోంది. కులం కన్నా గుణం ప్రధానమని మంచి చెడుల విశ్లేషణకు మధ్యయుగంలోనే బీజాలు వేసిన వేమన సాహిత్యంతో ఇక్కడి వారెందరో ప్రభావితమయ్యారు.

నేడు పద్య పఠన పోటీలు

నైతిక విలువలను, సమాజం పట్ల వ్యవహరించాల్సిన తీరును చాటి చెప్పే వేమన పద్య పఠన పోటీలు వేమన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఆ సంస్థ కార్యదర్శి డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి తెలిపారు. గురువారం ఉదయం 9.30 గంటలకు అనంతపురంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాల ప్రాంగణంలో వేమనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేమన జయంతిని నిర్వహించనున్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా 100 పాఠశాలల్లో పద్య పఠన పోటీలు ఏర్పాటు చేశారు.

వేమన పాఠ్యాంశాలు ఉండాలి



సమాజంలో సమస్యలను వేమన ఎత్తిచూపిన విధానం, పరిష్కార మార్గం వినూత్నంగా, విలక్షణంగా ఉన్నా.. నేటికీ అవి కొనసాగుతుండడం బాధాకరం. కాబట్టి వేమన సాహిత్యం మరింత విస్తృతం కావాలి. ప్రతి తరగతి గదిలో వేమన పాఠ్యాంశాలుంటే జాతి చైతన్యవంతమవుతుంది. వేమన సాహిత్యమంటే విజ్ఞానభాండాగారమే.
–డాక్టర్ రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, సాహితీ విమర్శకులు

సీమ సాహిత్యం విశ్వవ్యాప్తమైంది



వేమనతోనే సీమ సాహిత్యం విశ్వ వ్యాప్తమైంది. వేమన వంటి మహనీయుని జయంతిని అధికారికంగా జరపడం ఎంతో ఆనందించదగ్గ విషయం. ఆయన పద్యాలే కాదు నిరాడంబరమైన జీవితం అందరికీ ఆదర్శప్రాయం. వేమనా ఫౌండేషన్ అధ్యక్షునిగా వేమన సాహిత్యాన్ని ప్రచారం చేసే అవకాశం నాకు రావడం అదృష్టంగా భావిస్తున్నాను.
– ఆచార్య కాదా రామకృష్ణారెడ్డి, మాజీ వైస్ చాన్సలర్

జనసంద్రమైన తోపుదుర్తి



తోపుదుర్తి కుటుంబ సభ్యులతో మంత్రి ఉషశ్రీచరణ్, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, విందుకు హాజరైన జనం

ఆత్మకూరు: ఆత్మకూరు మండలం తోపుదుర్తి గ్రామం బుధవారం జనసంద్రమైంది. 140 ఏళ్ల తర్వాత నిర్వహించిన పెద్దమ్మ తల్లి ఊరి దేవరకు భారీగా జనం తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఏర్పాటు చేసిన విందులో 50 వేల మందికి పైగా పాల్గొనడం విశేషం. ముందుగా తోపుదుర్తి కుటుంబ సభ్యులు పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి విగ్రహాన్ని పొలిమేరకు చేర్చి పూజలు చేశారు. తర్వాత విందును ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యేతో పాటు తండ్రి తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, సోదరులు చందు, రాజశేఖర్‌రెడ్డి అక్కడే ఉండి పర్యవేక్షించారు. 36 కౌంటర్ల ద్వారా మాంసాహార, శాకాహార వంటకాలను వడ్డించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విందు కొనసాగింది. కొందరు గ్రామస్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రజలకు వాటర్ బాటిళ్లు అందించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు తమ ఇంటి పండుగలా భావించి అతిథులకు భోజనం వడ్డించారు. ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా అధికారులు, పోలీసు శాఖ వారు చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా గ్రామానికి దగ్గరలోనే దాదాపు ఐదెకరాల్లో వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకు 108 వాహనాలతో గ్రామంలోనే ఉండి సేవలందించారు.

తరలివచ్చిన ప్రజాప్రతినిధులు, నేతలు

ఊరి దేవరలో భాగంగా ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఇచ్చిన విందుకు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు తరలివచ్చారు. రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్, జిల్లా ఎస్పీ ఫక్కీరప్ప, ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, వై.వెంకట్రామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, డాక్టర్ సిద్దారెడ్డి, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, మాలగుండ్ల శంకర్‌నారాయణ, తిప్పేస్వామి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహమ్మద్, ఆగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, ఆర్టీసీ రీజినల్ చైర్‌పర్సన్ మంజుల, అనంతపురం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పైలా నరసింహులు, మేయర్ వసీం, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తోపుదుర్తి కవిత, వైఎస్సార్‌సీపీ నాయకులు తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





విందుకు హాజరైన ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, పెద్దారెడ్డి, వై.వెంకటరామిరెడ్డి, ఎస్పీ ఫక్కీరప్ప

హెచ్చెల్సీలో కర్ణాటక వాసి గల్లంతు

- కాలువలోకి దూసుకెళ్లిన ద్విచక్ర వాహనం

కణేకల్లు: హెచ్చెల్సీలో ద్విచక్ర వాహనం దూసుకెళ్లిన ఘటనలో ఓ యువకుడు గల్లంతయ్యాడు. మరో వ్యక్తి ప్రాణాలతో బయటపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కర్ణాటకలోని బళ్లారి రూరల్ ప్రాంతం చెరకుంటకు చెందిన గాదిలింగ, సంజీవరాయనికోటకు చెందిన సిద్ధ.. బొమ్మనహాళ్ మండలం శ్రీధరఘట్టలో జరిగిన ఊరి దేవరకు హాజరయ్యారు. అనంతరం మంగళవారం రాత్రి కణేకల్లు మండలం అంబాపురంలో జరిగే జాతరకు ద్విచక్ర వాహనంలో వచ్చారు. రాత్రి 10.30గంటలకు శ్రీధరఘట్టకు తిరుగు ప్రయాణమైన వీరు.. హెచ్చెల్సీ సమీపంలోకి చేరుకోగానే మలుపులో వాహన వేగాన్ని నియంత్రించుకోలేక నేరుగా కాలువలోకి దూసుకెళ్లారు. నీటి ప్రవాహంలో గాదిలింగ కొట్టుకెళ్లాడు. సిద్ధ ఈత కొడుతూ ఒడ్డుకు చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న గాదిలింగ తండ్రి సుంకప్ప, శ్రీధరఘట్టలోని బంధువులు, స్నేహితులు అక్కడకు చేరుకుని గాదిలింగ కోసం గాలింపు చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం గజ ఈతగాళ్లను కాలువలో దింపి గాలించారు. అయినా ఆచూకీ లభ్యం కాలేదు.


హెచ్చెల్సీలో గాలిస్తున్న బంధువులు, స్నేహితులు (ఇన్‌సెట్) గల్లంతైన గాదిలింగ

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

- 13 ద్విచక్రవాహనాల స్వాధీనం

గుంతకల్లు టౌన్: ద్విచక్ర వాహనాలను అపహరించుకెళుతున్న ఓ యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలను గుంతకల్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య వెల్లడించారు. బుధవారం ఉదయం గుంతకల్లులోని హనుమాన్‌సర్కిల్‌లో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో హనుమేష్‌నగర్‌కు గొని నరేంద్రరెడ్డి బళ్లారికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అడ్డుకునే ప్రయత్నం చేయడంతో వాహనాన్ని వదిలి పారిపోయేందుకు ప్రయత్నించాడు. పోలీసులు వెంటాడి నరేంద్రరెడ్డిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో అసలు విషయం వెలుగు చూసింది. వ్యసనాలకు బానిసైన తాను సులువుగా డబ్బు సంపాదించేందుకు ద్విచక్ర వాహనాలను అపహరించుకెళ్లి తక్కువ ధరకు ఇతరులకు విక్రయించేవాడినని పోలీసుల ఎదుట అంగీకరించాడు. అనంతరం వేర్వేరు ప్రాంతాల్లో దాచిన రూ. 6 లక్షలు విలువ చేసే 13 ద్విచక్ర వాహనాలను చూపడంతో వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. నిందితుడి అరెస్ట్‌లో చొరవ చూపిన ఎస్‌ఐ తిరుపాల్, హెడ్‌కానిస్టేబుల్ వెంకటేష్, కానిస్టేబుళ్లు వీరాంజినేయులు, దూద్‌పీరాను సీఐ అభినందించారు.కాగా, నిందితుడు నరేంద్రరెడ్డి గతంలో బళ్లారిలోనూ ద్విచక్ర వాహనాలు చోరీ చేసి పోలీసులక పట్టుబడి జైలుశిక్ష అనుభవించినట్లు పోలీసులు తెలిపారు. సమావేశంలో గుంతకల్లు రెండో పట్టణ సీఐ గణేష్‌బాబు, ఎస్‌ఐలు మురహరిబాబు, అంజినయ్య, సిబ్బంది పాల్గొన్నారు.


రోడ్డు నిబంధనలు పాటించండి

- వాహనదారులకు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ పిలుపు


రోడ్డు భద్రతా వారోత్సవాల బ్రోచర్ విడుదల చేస్తున్న జేసీ కేతన్‌గార్గ్, తదితరులు

అనంతపురం సెంట్రల్: రోడ్డు ప్రమాదంలో కుటుంబ సభ్యుడిని కోల్పోతే ఆ కుటుంబం కోలుకునేందుకు యాభై ఏళ్లు పడుతుందని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలని పిలుపునిచ్చారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం అనంతపురంలోని అంబేడ్కర్ భవన్‌లో రవాణా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ యంత్రాంగం, వాహనదారులు కలిసికట్టుగా నిబంధనలు పాటిస్తే ప్రమాద రహిత జిల్లాగా అనంతను తీర్చిదిద్దవచ్చునన్నారు. ఉప రవాణా కమిషనర్ శివరామప్రసాద్ మాట్లాడుతూ... రోడ్డు ప్రమాద రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 24వ తేదీ వరకూ వారోత్సవాలను నిర్వహిస్తోందన్నారు. రవాణాశాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ ఓబుల రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ భాగ్యరాజ్, ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ డాక్టర్ యుగంధర్, సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, దిశ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్టీఓ సురేష్‌నాయుడు, ఎంవీఐలు రమణారెడ్డి, అతికానాజ్, సునీత, సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

పీఆర్ ఇంజినీర్ల క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎస్ఈ భాగ్యరాజ్, డీఈ భాస్కరరెడ్డి

అనంతపురం సిటీ: పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్ల అసోసియేషన్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ బుధవారం ఆవిష్కరించారు. జెడ్పీ ఆవరణలోని చైర్‌పర్సన్ క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ భాగ్యరాజ్, పీఆర్ ఇంజనీర్ల అసోసియేషన్ ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షుడు భాస్కరరెడ్డి, అనంతపురం జిల్లా అధ్యక్షుడు డీఎల్ మురళి, జనరల్ సెక్రటరీ ప్రసాద్, ఉపాధ్యక్షురాలు జింకా కృష్ణజ్యోతి, ట్రెజరర్ పాండురంగారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ నారాయణస్వామి పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి


పవన్‌కళ్యాణ్ (ఫైల్)

బొమ్మనహాళ్: మండలంలోని సింగానహళ్లిలో ఓ యువకుడు అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. సింగానహళ్లికి చెందిన బోయ శంకరప్ప కుమారుడు పవన్‌కళ్యాణ్ (22) అవివాహితుడు. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ కోర్సు చేస్తున్నాడు. సంక్రాంతి పండుగకు ఇంటికి చేరుకున్న పవన్‌కళ్యాణ్ మంగళవారం శ్రీధరఘట్టలో జరిగిన ఊరి దేవరకు కుటుంబ సభ్యులతో కలసి బంధువుల ఇంటికి వెళ్లాడు. తండ్రి శంకరప్ప, కుటుంబసభ్యులు మంగళవారం రాత్రే ఇంటికి తిరిగి వెళ్లారు. అర్ధరాత్రి వరకూ శ్రీధరఘట్టలోనే బంధువులతో గడిపిన పవన్‌కళ్యాణ్ తర్వాత స్నేహితులతో కలసి బయటకు వెళ్లాడు. బుధవారం వేకువజాము 2 గంటలకు స్వగ్రామానికి చేరుకుని నిద్రకు ఉపక్రమించాడు. ఆ సమయంలో భారీగా గురక పెట్టడంతో తండ్రి శంకరప్ప నిద్ర మేల్కొన్నాడు. ఊపిరి అందక కుమారుడు పడుతున్న ఇబ్బందిని గమనించి, వెంటనే బళ్లారిలోని విమ్స్‌కు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. శంకరప్ప ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.


గొర్రెలపై దూసుకెళ్లిన టిప్పర్

గుమ్మఘట్ట: మండలంలోని మారెంపల్లి సమీపంలో రాయదుర్గం- అనంతపురం ప్రధాన రహదారిపై బుధవారం రాత్రి గొర్రెల మందపై ఓ టిప్పర్ దూసుకెళ్లింది. ఘటనలో ఎనిమిది గొర్రెలు మృత్యువాతపడ్డాయి. మరో ఐదు గొర్రెలు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాయి. మారెంపల్లికి చెందిన కురుబ ఈరన్న తన పొలం నుంచి గొర్రెలు తోలుకుని ఇంటికి వెళుతుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. టిప్పర్ డ్రైవర్ అతి వేగమే కారణంగా తెలుస్తోంది. ఘటనతో రూ.1.20 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధిత కాపరి వాపోయాడు.

బెటాలియన్ నుంచి ఏఆర్‌కు 15 మంది

బుక్కరాయసముద్రం: ఏపీఎస్పీ 14వ బెటాలియన్ నుంచి ఏఆర్‌కు పలువురు కానిస్టేబుళ్లు బదిలీ అయ్యారు. విభాగాల మధ్య కన్వర్షన్‌లో భాగంగా 15 మంది కానిస్టేబుళ్లను బదిలీ చేసినట్లు బెటాలియన్ డీఎస్పీ రమణమూర్తి తెలిపారు. ఈ నేపథ్యంలో బదిలీపై వెళుతున్న సిబ్బందిని బుధవారం బెటాలియన్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రమణమూర్తి మాట్లాడుతూ.. అంకిత భావంతో పని చేసినప్పుడే తగిన గుర్తింపు ఉంటుందన్నారు. బదిలీపై సొంత జిల్లాలకు వెళుతున్న 15 మందిని అభినందించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ లోకేశ్వరనాయుడు, నాగేంద్ర, డాక్టర్ ఖర్షీద్ బేగం, బెటాలియన్ వెల్ఫేర్ ఆఫీసర్ అక్కులప్ప, బెటాలియన్ యూనియన్ అధ్యక్షుడు పెద్దయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా పోలీసుకు తప్పిన ప్రాణాపాయం



స్కూటీలో ఉన్న పామును చంపుతున్న దృశ్యం

కూడేరు: మండలంలోని బోశసముద్రం సచివాలయ మహిళా పోలీసు పోలీమ్మకు త్రుటిలో పాము కాటు నుంచి తప్పించుకుంది. బుధవారం సాయంత్రం విధులు ముగించుకున్న ఆమె తన స్కూటీలో అనంతపురానికి బయలుదేరింది. రాత్రి 7.30 గంటలకు బ్రాహ్మణపల్లి వద్ద ప్రయాణిస్తుండగా స్కూటీ ముందు భాగం నుంచి చేతి వైపుగా ఓ పాము వస్తుండడాన్ని చీకట్లో ఆమె గమనించి వెంటనే వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి, స్థానికుల సాయం కోరింది. స్పందించిన స్థానికులు చీకట్లో సెల్ ఫోన్ లైట్ల వెలుతురులో స్కూటీలో ఉన్న పామును బయటకు వచ్చేలా చేసి చంపేశారు.

పశుదాణా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

కూడేరు: గ్రాసం కొరతను అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా సమీకృత సంపూర్ణ పశుదాణా పథకాన్ని అమలు చేస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాడి రైతులకు జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ (డీఎల్‌డీఏ) ఈఓ డాక్టర్ సుధాకర్ సూచించారు. పశు సంవర్ధక, పశుగణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో బుధవారం కూడేరు మండలం ముద్దలాపురంలో బుధవారం 'జాతీయ పశు కృత్రిమ గర్భధారణ'పై అవగాహన సదస్సు నిర్వహించారు. కృత్రిమ గర్భధారణతో పుట్టిన దూడలను ప్రదర్శనకు ఉంచారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ.. సమీకృత సంపూర్ణ పశుదాణాని పాలిచ్చే పశువులకు అందిస్తే దిగుబడి ఆశాజనకంగా ఉంటుందన్నారు. కిలో దాణా ధర రూ.16.50 కాగా ప్రభుత్వం రూ.10తో అందజేస్తోందన్నారు. ఒక పాడి రైతుకు 1,800 కిలోల చొప్పన సమీకృత సంపూర్ణ పశుదాణాని అందజేస్తామన్నారు. కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన దూడల్లో ఎదుగుదలపై పాడిరైతులను చైతన్య పరిచారు. అనంతరం ప్రదర్శనలో ఉంచిన దూడల్లో ఎదుగుదల బాగుండి, ఆకర్షణీయంగా ఉన్నవాటి యజమానులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుబ్బమ్మ, సర్పంచ్ ధనుంజయ, పశుగణాభివృద్ధి సంస్థ డాక్టర్ వినోద్‌కుమార్, మండల పశువైద్యాధికారి శ్రీనివాసులు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

జిల్లా జూనియర్ బాలికల హాకీ జట్టు ఎంపిక


జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా జూనియర్ హాకీ బాలికల జట్టు ఎంపిక ప్రక్రియను బుధవారం అనంత క్రీడాగ్రామంలోని మైదానంలో నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు పెద్ద ఎత్తున హాజరుకాగా, వీరిలో ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో అనంతపురానికి చెందిన లక్ష్మి, సంధ్య, భరణి, రేవతి, నందిని, స్వరూప, లావణ్య, పావని, శోభాబాయి, ఉషశ్రీ, లక్ష్మి, నార్పలకు చెందిన అక్షయ, మమత, సౌమ్య, మానస, విష్ణుప్రియ, కళ్యాణదుర్గానికి చెందిన వైష్ణవి, అఖిల ఉన్నారు. ఎంపికైన జట్టు ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకూ అనకాపల్లి జిల్లా యలమంచిలిలో జరిగే 13వ రాష్ట్ర స్థాయి జూనియర్ హాకీ పోటీల్లో పాల్గొననుంది.

క్లుప్తంగా

పదోన్నతులు కల్పిస్తాం



జూమ్ మీటింగ్‌లో హాజరైన వైద్యాధికారులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: అసోసియేట్ ప్రొఫెసర్ల నుంచి ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పిస్తామని వైద్య, ఆరోగ్య శాఖ డీఎంఈ వినోద్‌కుమార్ తెలిపారు. బుధవారం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఆస్పత్రి సూపరింటెండెంట్, వివిధ విభాగాల విభాగాధిపతులతో ఆయన మాట్లాడారు. గురువారం నుంచి ప్రక్రియ మొదలవుతుందన్నారు. వాటికి సంబంధించిన నివేదికలను పూర్తిగా అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, డీసీహెచ్ఎస్ డాక్టర్ కృష్ణవేణి, విభాగాల విభాగాధిపతులు డాక్టర్ ఆత్మారాం, డాక్టర్ షంషాద్‌బేగం, డాక్టర్ వైద్యనాథ్, డాక్టర్ రామస్వామి, ఆర్ఎంఓ పద్మజ పాల్గొన్నారు.

రెండో రోజూ ధర్నా



బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పెన్షనర్లు

అనంతపురం సిటీ: అనంతపురంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట ఆ శాఖ పెన్షనర్లు చేపట్టిన ధర్నా రెండో రోజూ(బుధవారం) కొనసాగింది. ఆలిండియా పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పిలుపు మేరకు పెన్షన్ రివిజన్‌తో పాటు ఇతర సమస్యలన్నీ పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. లేకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

మూలనపడిన గార్బేజీ వాహనం



తిరుమలనగర్‌లో మూలన పడేసిన నగరపాలక సంస్థ గార్బేజ్ వాహనం

అనంతపురం క్రైం: నగరంలోని 41వ డివిజన్ తిరుమలనగర్‌లో ఐదు నెలలుగా గార్బేజ్ వాహనాన్ని మూలకు పడేశారు. మరమ్మతుకు నోచుకోకపోవడంతో వాహనాన్ని అక్కడే వదిలేశారు. రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన వాహనాన్ని ఇలా పడేయడం నగరపాలక సంస్థ అధికారుల బాధ్యతారాహిత్యానికి అద్దం పడుతోంది.

ఎం.చెర్లోపల్లిలో ఘనంగా మబ్బు దేవర

రాప్తాడు: మండలంలోని ఎం.చెర్లోపల్లిలో బుధవారం ముత్యాలమ్మ, పోతులయ్య స్వామికి మబ్బుదేవర (ఊరు దేవర) ఘనంగా జరిపారు. వేకువజామునే పోతులయ్య స్వామికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి, బలి ఇచ్చారు. గ్రామస్తులు ఇళ్లలో ముత్యాలమ్మ దేవతను ఏర్పాటు చేసుకొని, ప్రత్యేక పూజలు చేసి, బలి ఇచ్చారు. గ్రామస్తులు బంధువు,మిత్రులకు విందు ఇచ్చారు.పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వర్క్ అడ్జెస్ట్‌మెంట్ రద్దు చేయాలి



ఇన్‌చార్జ్ డీఈఓ కృష్ణయ్యకు వినతి పత్రం అందజేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

అనంతపురం: జిల్లాలో ఈ నెల 13న జరిగిన వర్క్ అడ్జెస్ట్‌మెంట్ రద్దు చేసి తిరిగి కౌన్సెలింగ్ నిర్వహించి స్థానాలు కేటాయించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు శ్రీధర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు ఇన్‌చార్జ్ డీఈఓ ఎస్.కృష్ణయ్యకు బుధవారం వినతి పత్రం అందజేశారు. సీనియర్ ఉపాధ్యాయులకు అనలైన ఖాళీలను చూపకుండా జూనియర్ ఉపాధ్యాయులకు మంచి స్థానాలు దక్కాయన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట శివారెడ్డి, వెంకట్ నారాయణరెడ్డి, తిమ్మారెడ్డి, శ్రీకాంత్, సురేష్ పాల్గొన్నారు.

23న మెగా వైద్య శిబిరం

ఉరవకొండ: స్థానిక లయన్స్ క్లబ్ కార్యాలయంలో ఈనెల 23 ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సప్తగిరి మల్లికార్జున తెలిపారు. బుధవారం శిబిరానికి సంబంధించి కరపత్రాలు విడుదల చేశారు. శిబిరంలో కార్డియాలజీ, జనరల్ మెడిసిన్, ఆర్థో, స్త్రీ సంబంధిత వ్యాధులకు సంబంధించి వైద్య నిపుణులు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారన్నారు. లయన్స్ సభ్యులు చందా కేశన్న, కొమ్మసాని బాలచంద్ర, సప్తగిరిమల్లి స్పాన్సర్స్‌గా వ్యవహరిస్తారన్నారు.

గడప గడపకూ సంక్షేమ పథకాలు

• ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



41వ డివిజన్ యువజన కాలనీలో ప్రభుత్వం చేసిన మేలును వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: మూడున్నరేళ్లలో ప్రజలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి అనేక సంక్షేమ పథకాలు వర్తింపజేశామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని 41వ డివిజన్ తిరుమలనగర్‌లో ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థాని కార్పొరేటర్ గోగుల లక్ష్మిదేవి, డివిజన్ కన్వీనర్ రాధాకృష్ణతో కలసి ప్రభుత్వం చేసిన మేలును లబ్ధిదారులకు ఎమ్మెల్యే వివరించారు. కామారుపల్లి భూమిలో నీరు ఊరుతుండడంతో మరోచోట స్థలం కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని లబ్ధిదారులు మదన్‌మోహన్, లక్ష్మిదేవి, జయంతి, తదితరులకు ఎమ్మెల్యే తెలియజేశారు.

టెండర్ రద్దు చేయండి:
డివిజన్‌లో కాలువ పూడికతీత పనులు ఎనిమిది నెలలుగా కాంట్రాక్టర్ శివగంగాధర్ రెడ్డి జాప్యం చేస్తున్నారని, వర్షం వచ్చినప్పుడు ఇబ్బంది ఉంటుందని డివిజన్ కన్వీనర్ రాధాకృష్ణ ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశాడు. టెండర్ దక్కించుకొని నెలలు తరబడి పనులు చేయని వారి టెండర్లను రద్దు చేయాలని డీఈ రాంప్రసాద్ రెడ్డిని ఎమ్మెల్యే ఆదేశించారు. గ్యాంగ్ వర్క్ చేపట్టి పూడికతీత పనులు సాధ్యమైనంత త్వరలో చేపట్టాలని ఎంహెచ్‌ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డిని ఎమ్మెల్యే ఆదేశించారు. తిరుమలనగర్‌లో కాలువ చిన్నగా ఉన్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే కాలువ వెడల్పు మరో 6 నుంచి 7 అడుగులు పెంచేలా చూడాలన్నారు. వెంకటరమణమ్మ అనే వృద్ధురాలు తన భర్త జయరామిరెడ్డి పింఛన్‌ను రద్దు చేసి, తనకు మంజూరు చేయించాలని ఎమ్మెల్యేను కోరింది. ఎంఎల్‌ఓ డాక్టర్ దామోదర్ రెడ్డిని పరిశీలించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అఖిలాబేగం అనే మహిళ తమకు ఆరు కరెంటు మీటర్లున్నట్లు చూపుతోందని, తద్వారా అమ్మ ఒడి మంజూరు కాలేదని ఎమ్మెల్యేకి విన్నవించింది. రేషన్‌కార్డు మంజూరు చేయాలని బాల అంకెన్న అనే వ్యక్తి ఎమ్మెల్యేను కోరాడు.

మురుగు సమస్య పరిష్కరిస్తాం :
41వ డివిజన్‌లోని తిరుమలనగర్, తదితర ప్రాంతాల్లో మురుగు సమస్యకు పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే స్థానిక ప్రజలకు తెలిపారు. పలువురు మురుగు, దోమల సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో ఆయన స్పందించారు. సాధ్యమైనంత త్వరగా ప్రాధాన్య క్రమంలో పారిశుధ్య సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, స్టేట్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ గౌస్‌బేగ్, కార్పొరేటర్లు సైఫుల్లాబేగ్, దుర్గాదేవి, నాయకులు ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, రామయ్య, పోతులయ్య, పవన్, నాగార్జున, విజయ్, గోయిందు, రామచంద్ర, సుహాసిని, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

అనంతపురం క్రైం: నగరంలోని 41వ డివిజన్‌లో గురువారం ఉదయం 6:30 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. యువజన కాలనీ హైమాస్ లైట్స్ సర్కిల్ నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, అధికారులు హాజరుకావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

రాయదుర్గం ఘటనపై విచారణ జరిపించాలి

అనంతపురం అర్బన్: రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో కురబ రామాంజనేయులు మరణంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. గొర్రెల చోరీ కేసులో స్టేషన్‌కు తీసుకొచ్చిన రామాంజనేయులు ఆత్మహత్య చేసుకోవడంపై అనుమానాలకు తావిస్తోందని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిందితులను సకాలంలో కోర్టులో హాజరు పర్చకపోవడం వల్లనే ఈ మరణం జరిగిందన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం న్యాయ విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలన్నారు.

• ప్రమాదం పక్కనే ప్రయాణం



బ్రదరూ.. అడ్డగీతలు లేవు చూడరూ.. : బస్టాండ్ సమీపంలో స్పీడ్ బ్రేకర్ ముందు కనిపించని గీతలు



డ్రైవరూ.. నిదానంగా వెళ్లుము: ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని భగీరథ సర్కిల్‌లో ఇలా..

నగరంలో రూ.కోట్లు వెచ్చించి రహదారులు నిర్మించారు..అయితే ప్రమాదాలు జరగకుండా నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. పలు చోట్ల కూడళ్లలో జీబ్రా లైన్లు వేయించలేదు. దీంతో స్పీడ్ బ్రేకర్లు ఉన్న విషయాన్ని గుర్తించక, వేగాన్ని అదుపుచేసుకోలేక కిందపడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని జీబ్రాలైన్లు వేయించాలని వాహనదారులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



స్టాప్ ..స్టాప్.. : రాజహంస అపార్ట్‌మెంట్ ఎదురుగా ఉన్న స్పీడ్ బ్రేకర్‌పై కూడా కనిపించని జీబ్రాలైన్లు

జర చూసి వెళ్లండి



నగరంలోని శ్రీకంఠం సర్కిల్ వద్ద డివైడర్‌కు ఆనుకొని పెద్ద బండరాయి ఉంది. కొన్ని నెలలుగా బండరాయి అక్కడే ఉన్నా.. దాన్ని తొలగించడానికి ఎవరూ సాహసం చేయలేదు. పొరపాటున వాహనదారులు రాయిని తగిలితే ప్రాణాలకే ప్రమాదం. నగరపాలక సంస్థ అధికారులు బండరాయిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



అన్నో.. దూరం పాటించండి : గుత్తి రోడ్డు సమీపంలో ఆర్టీసీ బస్సు వెనక ఇలా..

త్వరితగతిన సేవలు అందించండి

పుట్లూరు: గ్రామ సచివాలయాలకు వచ్చే ప్రజలకు త్వరితగతిన సేవలను అందించాలని డివిజినల్ అభివృద్ధి అధికారి ఓబుళమ్మ సిబ్బందికి సూచించారు. బుధవారం ఆమె పుట్లూరు, తక్కళ్లపల్లి, శనగలగూడూరు గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామ సచివాలయాల్లో అందించిన సేవలను పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎంపీడీఓ యోగానందరెడ్డి, ఈఓఆర్డీ ఆనంద్‌ప్రసాద్ పాల్గొన్నారు.

యల్లనూరు: సచివాలయాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అనంతపురం డీఎల్‌డీవో ఓబుళమ్మ పేర్కొన్నారు. బుధవారం నిట్టూరు, పెద్దమల్లేపల్లి, యల్లనూరు–1 సచివాలయాలను ఆమె తనిఖీ చేశారు. సచివాలయ పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ సర్వేను త్వరగతిన పూర్తి చేయాలన్నారు. ఈ నెల 19వ తేదీ నుంచి నిర్వహించే మెగా ఆధార్ క్యాంపును ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ప్రతి ప్రభుత్వ, సచివాలయ ఉద్యోగి బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా వేయాలన్నారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓరామచంద్రారెడ్డి, ఈఓఆర్డీ విజయశేఖర్‌నాయుడు, పంచాయతీ కార్యదరులు గీతా, కృష్ణవేణి పాల్గొన్నారు.

రాయలసీమకు న్యాయం చేయాలి

• రాయలసీమ విమోచన సమితి అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి

అనంతపురం సప్తగిరి సర్కిల్: శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాయలసీమకు పూర్తి న్యాయం చేయాలని రాయలసీమ విమోచన సమితి అధ్యక్షుడు రాజశేఖర రెడ్డి కోరారు. బుధవారం అనంత నగరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాయలసీమకు ప్రత్యేకంగా హైకోర్టును, రాజధాని ఏర్పాటు చేయాలని కోరారు. రాయలసీమ ప్రాంతంలో ఏర్పాటు చేయాల్సిన ఆంధ్ర యూనివర్సిటీని తరలించుకుపోయారన్నారు. ఎయిమ్స్ హాస్పిటల్, విభజన చట్టంలో భాగంగా అందించాల్సిన సెంట్రల్ యూనివర్సిటీని ఆంధ్ర ప్రాంతంలో ఏర్పాటు చేసి, ఈ ప్రాంతానికి తీరని అన్యాయం చేశారన్నారు. గుంతకల్లు రైల్వే జోన్, 400 టీఎంసీల నీటి కేటాయింపు, కడప ఉక్కు ఫ్యాక్టరీ అందించాలన్నారు. అమరావతి ప్రాంతాన్ని ఫ్రీజోన్ చేసి రాయలసీమ వాసులకు ఉద్యోగాల్లో వాటాను కల్పించాలన్నారు. కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు కార్యాలయాన్ని కర్నూలులో ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నవీన్‌రెడ్డి, విజయ్ భాస్కర్, జ్ఞానేశ్వర్, సీతారాం, రమేష్, కాశిరావు, హరికృష్ణ, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

టెంకాయల వేలం పాట

బొమ్మనహాళ్/బెళుగుప్ప: రామసాగరం గ్రామ సమీపంలోని బూదిగుమ్మ ఆంజనేయస్వామి, వేంకటరమణ స్వామి క్షేత్రాల్లో పూజా సామగ్రితో కూడిన టెంకాయల వేలం పాటను బుధవారం నిర్వహించారు. మండల దేవదాయశాఖాధికారి ఈశ్వర్‌రెడ్డి అధ్యక్షతన ప్రత్యేకాధికారి అక్కిరెడ్డి పర్యవేక్షణలో రామసాగరంలోని రామస్వామి ఆలయం వద్ద జరిగిన వేలంలో రామసాగరం వాసి ఎం.అక్కులప్ప రూ.1,71,000 దక్కించుకున్నాడు. సర్పంచ్ రామకృష్ణమ్మ, ఎంపీటీసీ వీరబొమ్మన్న, ఆలయ కమిటీల చైర్మన్లు తిమ్మారెడ్డి, ఈశ్వరమ్మ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

హిందువులపై దాడులు నియంత్రించండి



డీఆర్‌ఓ గాయత్రిదేవికి వినతిపత్రం అందజేస్తున్న విశ్వహిందూపరిషత్ నాయకులు

అనంతపురం అర్బన్: దేశంలో హిందూ సంస్థల కార్యకర్తలు, నాయకులపై దాడులు జరుగుతున్నాయని, దీన్ని నియంత్రించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విశ్వ హిందూపరిషత్ భజరంగదళ్ నాయకులు అన్నారు. బుధవారం డీఆర్‌ఓ గాయత్రిదేవిని కలెక్టరేట్‌లోని ఆమె చాంబర్ వద్ద వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు అక్కిరెడ్డి జయరాముడు, రాష్ట్ర కార్యదర్శి కె.రాముడు, ఇతర నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. తమ వినతిని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. తమ డిమాండ్లను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

23 నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

తాడిపత్రి టౌన్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి పురస్కరించుకుని అనంతపురంలో ఈనెల 23 నుంచి రెండు రోజులపాటు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు బీజేపీ నాయకులు పేర్కొన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో బుధవారం జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. నియోజకవర్గ కన్వీనర్ రంగనాథరెడ్డి, పట్టణాధ్యక్షుడు ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు భీమలింగేశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శి చెన్నారంగనాయకులు, మైనార్టీ విభాగం పట్టణాధ్యక్షుడు రజాక్ పాల్గొన్నారు.

బైక్ రైడర్లకు ఆర్టీఏ అధికారుల కౌన్సెలింగ్



విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీటీసీ శివరామప్రసాద్

అనంతపురం సెంట్రల్: ద్విచక్ర వాహనాలతో రోడ్లపై విన్యాసాలు చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న బాలురను ఆర్టీఏ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం హౌసింగ్ బోర్డు నుంచి ఆర్టీఏ కార్యాలయం మీదుగా జేఎన్‌టీయూఏకు వెళ్లే రహదారిపై ఆర్టీఏ కార్యాలయానికి సమీపంలో నివాసం ఉంటున్న 14 ఏళ్లలోపు విద్యార్థులు పల్సర్, యాక్టివా, డూక్ బైక్‌లతో వేగంగా విన్యాసాలు చేశారు. ఈ సమయంలో ఓ విద్యార్థి కిందపడి గాయపడ్డాడు. అక్కడే ఉన్న ఆర్టీఏ అధికారులు అందరినీ అదుపులోకి తీసుకున్నారు. బైక్‌లను ఆర్టీఏ కార్యాలయానికి తీసుకెళ్లారు. డీటీసీ శివరామప్రసాద్ విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇలాంటి విన్యాసాలు చేస్తే విద్యార్థులతోపాటు వాహనాలు ఇచ్చి ప్రోత్సహించే తల్లిదండ్రులపైనా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్టీఓ సురేష్‌నాయుడు, ఎంవీఐ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేకేకాలనీ పంచాయతీ బిల్ కలెక్టర్ మృతి



నాగరాజు (ఫైల్)

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి కాలనీ పంచాయతీ కార్యాలయంలో బిల్ కలెక్టర్‌గా పని చేస్తున్న నాగరాజు (46) గుండెనొప్పితో మృతి చెందాడు. ఈయన దాదాపు 20 ఏళ్లకు పైగా కాంట్రాక్ట్ వర్కర్‌గా పని చేస్తున్నాడు. గత కొంతకాలంగా బోదకాళ్ల వ్యాధితో బాధపడుతున్నాడు. వ్యాధి తీవ్రతరం కావడంతో మంగళవారం కుటుంబ సభ్యులు బెంగళూరుకు తరలించారు. చికిత్స అందించే క్రమంలో గుండెనొప్పి వచ్చి మృతి చెందాడు. నాగరాజు మృతిపై బుధవారం కుటుంబ సభ్యులు, మరికొందరు కలిసి పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. కార్యదర్శి ఒత్తిళ్లతోనే నాగరాజు మృతి చెందాడంటూ ఆరోపించారు. కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గత సెప్టెంబరు నుంచి నాగరాజు విధులకు హాజరుకాలేదన్నారు. అయినా ఆయనకు నోటీసులు ఇవ్వడంగానీ, విధుల నుంచి తొలగించడంకానీ చేయలేదన్నారు.

ఇద్దరికి గాయాలు

గుత్తి రూరల్: కొజ్జేపల్లి గ్రామ శివారులో ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ కొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. తురకపల్లికి చెందిన సురేంద్ర కొజ్జేపల్లిలో జరిగే ఊరు దేవరకు వెళ్లాడు. మంగళవారం అర్ధరాత్రి తిరిగి తురకపల్లికి బైక్‌పై వెళ్తుండగా గ్రామ శివారులోని మలుపు వద్ద నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన విజయ్ బైక్‌తో ఢీకొన్నాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సురేంద్ర, విజయ్‌ను 108 వాహనం ద్వారా గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువజనోత్సవాల నిర్వహణ అభినందనీయం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కోగటం విజయభాస్కరరెడ్డి తదితరులు

అనంతపురం కల్చరల్: శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈనెల 22న జరగనున్న యువజన కళాఉత్సవ్‌లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి అన్నారు. హైదరాబాదులో పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ఎన్టీఆర్ కళావేదికలో జరుగనున్న పోస్టర్లను బుధవారం కోగటం విజయభాస్కరరెడ్డితో పాటు శ్రీశ్రీకళావేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా హరిసర్వోత్తమ నాయుడు, ఉపాధ్యక్షుడు డాక్టర్‌పతికి రమేష్ నారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి టీవీరెడ్డి, అల్తాఫ్ తదితరులు ఆవిష్కరించారు. రామచంద్రానగర్‌లో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ యువత ప్రతిభా పాటవాలకు పెద్ద పీట వేస్తూ 12 గంటల పాటూ సాహిత్య, సాంస్కృతిక వేదుకలతో కళా ఉత్సవ్‌సాగుతుందన్నారు.

హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాజారెడ్డి

అనంతపురం అర్బన్: హమాలీ కార్మికుల అభివృద్ధికి ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో హమాలీ కార్మికుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ ఈనెల 29 నుంచి మూడు రోజుల పాటు తిరుపతిలో జరగనున్న హమాలీ కార్మికుల సంఘం రాష్ట్ర 3వ మహాసభలకు హమాలీలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌గౌడ్, హమాలీ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీకే కృష్ణుడు నాయకులు మహేశ్, ఈశ్వరయ్య, రమేశ్, నారాయణ, చితంబరి, దాసు, నరసింహులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ, గంగమ్మ జాతర

పెద్దపప్పూరు: శింగనగుట్టపల్లిలో బుధవారం పెద్దమ్మ ,గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారి ప్రతిమను గ్రామ పురవీధుల్లో తప్పెట్లు, మేళతాళాలతో ఊరేగించారు. మరోవైపు తొగటవీర క్షత్రియులు నిర్వహించిన జ్యోతుల మహోత్సవం కనుల పండువగా సాగింది. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి హాజరుకాగా వైస్ ఎంపీపీ పప్పక కళావతి, వైఎస్సార్‌సీపీ నేత గంగరాజు, గ్రామస్తులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెద్దబాబుకు పరామర్శ : ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకున్న ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న తబ్జూల వైఎస్సార్‌సీపీ నేత పెద్దబాబు(చంద్రశేఖరరెడ్డి)ను బుధవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పరామర్శించారు.

ఉత్సాహంగా రాతిదూలం లాగుడు పోటీలు

పామిడి: అంకాలమ్మ, కుంటిమ్మ జాతర సందర్భంగా నిర్వహించిన న్యూ కేటగిరీ రాతిదూలం లాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఇందులో తాడిపత్రి రైతు రమేష్‌యాదవ్ వృషభాలు మొదటిస్థానంలో నిలిచి రూ.40 వేలు నగదు బహుమతి గెలుచుకున్నాయి. నంద్యాల జిల్లా మిడుతూరు మండలం రోళ్లపాడు రైతుమురళీమోహన్‌రెడ్డి వృషభాలు ద్వితీయ(రూ.30వేలు) పెద్దపప్పూరు మండలం సోదనపల్లి రైతు ప్రసాద్‌నాయుడు వృషభాలు తృతీయ(రూ.20వేలు), పెద్దవడుగూరు మండలం మేడిమాకులపల్లి రైతు తిరుపాల్‌రెడ్డి వృషభాలు నాల్గో(రూ.10 వేలు) నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం టీ హుసేనాపురం రామసుబ్బారెడ్డి వృషభాలు ఐదోస్థానంలో నిలిచి రూ.5వేలు అందుకున్నాయి.

అంకాలమ్మ, కుంటిమ్మకు ప్రత్యేక పూజలు : కొండూరు రోడ్డులో వెలసిన అంకాలమ్మ, కుంటిమ్మకు జాతర సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేయించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌ఛార్జ్ జానకిరామిరెడ్డి, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి, ఆర్‌సీ వెంకట్రామిరెడ్డి, చుక్కలూరు రామచంద్రారెడ్డి, జోజోడే కుమార్, జగని రవి, అనుంపల్లి సూరి తదితరులు పాల్గొన్నారు.